క్లుప్తంగా

టికెట్ ధరలపై ఆందోళన వద్దు

పట్నంబజారు: హజ్ యాత్రకు సంబంధించి సెంట్రల్ హజ్ కమిటీ నిర్ణయించిన టిక్కెట్ ధరలపై హజ్ యాత్రికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నగర డెప్యూటీ మేయర్ షేక్ సజిల చెప్పారు. మాయాబజారులోని ఆమె కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిక్కెట్లు ధరల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టిందని తెలిపారు.

వేసవి విజ్ఞాన శిబిరం

గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల వద్ద ఉన్న ప్రాంతీయ గ్రంథాలయంలో మంగళవారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా జువాలజీ అధ్యాపకురాలు మణి విద్యార్థులకు భాషా నైపుణ్యంపై శిక్షణ కల్పించారు. ఈసందర్భంగా పుస్తక పఠనం, వ్యాకరణాన్ని నేర్పించారు. పిల్లల్లో మానసిక ఉల్లాసానికి మంచి కథ నేరి ్పంచి, క్రమశిక్షణతో కూడిన సామాజిక భద్రతపై అవగాహన కల్పించారు. సైన్స్, సోషల్, గణిత సబ్జెక్టుల్లో విద్యార్థులు ఏస్థాయిలో ఉన్నదీ గమనించి, ఆయా సబ్జెక్టుల్లో నైపుణ్యాలను నేర్పించారు. గ్రంథాలయాధికారి ఎస్. వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

ఏఎన్‌యూ: యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ఆచార్య ఎం .రవిశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రమవుతున్నందున యూనివర్సిటీకి వచ్చే సందర్శకులు, జాతీయ రహదారిపై వెళ్లే ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఎన్ఎస్ఎస్ అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ డి.రవిశంకర్ రెడ్డి, ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఇ.శ్రీనివాసరెడ్డి, యూనివర్సిటీ ర్యాకింగ్స్ కో–ఆర్డినేటర్ డాక్టర్ భవనం నాగకిషోర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఆచార్య కేవీ నిరుపమ, డాక్టర్ ప్రసన్నకుమార్, డాక్టర్ సీహెచ్ రవికుమార్, డాక్టర్ యుగంధర్‌రెడ్డి, యూనివర్సిటీ ఇంజినీర్ కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

పట్నంబజారు: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకోవడంతోపాటు, అతని నుంచి గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సీతానగర్‌కు చెందిన ముక్కోటి రాము అనే వ్యక్తి పొన్నూరు రోడ్డులోని పెట్రోలు బంకు వద్ద గంజాయి విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారం అందుకున్న పోలీసులు దాడిచేసి నిందితుడిని పట్టుకోవడంతోపాటు, 750 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తిపై కత్తితో దాడి

పట్నంబజారు: వ్యక్తిపై కత్తితో దాడిచేసిన సంఘటనపై కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆనందపేటకు చెందిన పఠాన్ ఫారూఖ్, షమ్మద్‌లు బంగారం పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. వీరితోపాటు బంగారం పనులు చేసే సిరాజ్, జియా అనేవారికి గత నాలుగు నెలల క్రితం వివాదం జరగడంతో పెద్దలు సర్ది చెప్పారు. ఈనేపథ్యంలో సిరాజ్ నిత్యం షమ్మద్‌ను ఆగ్రహంతో చూస్తుండటంతో ఈనెల 8వ తేదీ రాత్రి తనను ఎందుకు ఆగ్రహంతో చూస్తున్నావంటూ షమ్మద్ సిరాజ్‌ను అడిగేందుకు వెళ్లాడు. ఈక్రమంలో షమ్మద్‌పై సిరాజ్ కత్తితో దాడిచేయగా గాయాలయ్యాయి. షమ్మద్ స్నేహితుడు ఫారూఖ్ ఫిర్యాదు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భజే ప్రసన్నాంజనేయం



చేబ్రోలు: హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసన్నాంజనేయస్వామికి అర్చకులు 108 కలశాలతో సుగంధ జలాభిషేకం కనుల పండువగా చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

పెదనందిపాడు: ఎక్కువగా మ ద్యం తాగి వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. మంగళవారం రాత్రి ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ కథనం ప్రకారం మండల పరిధిలోని నాగులపాడు గ్రామానికి చెందిన నీలం సత్యానందం(44) కొన్ని రోజులుగా మద్యం ఎక్కువగా సేవిస్తున్నాడని, మద్యం మత్తులో పొలాల్లో పడుకుని ఉన్నాడని, ఉదయం స్థానికులు లేపిచూడగా లేవలేదని, మృతి చెందిఉన్నట్లు స్థానికులు తెలిపారు. మృతుని తండ్రి కృపారావు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఆయన వెల్లడించారు.

కూలీల మస్టర్లు సక్రమంగా ఉండాలి

కొండపాటూరు(కాకుమాను): ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల మస్టర్లు సక్రమంగా ఉండాలని ఎస్ఆర్పీ రామారావు సూచించారు. కొండపాటూరు, రేటూరు గ్రామాలలో మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు.

ప్రజాసమస్యలకు మెరుగైన పరిష్కారం

నగర కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నాణ్యమైన ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించడమే జగనన్నకు చెబుదాం కార్యక్రమం లక్ష్యం అని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో నగర కమిషనర్ ఆదేశాల మేరకు డెప్యూటీ కమిషనర్లు, అధికారులు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజల సమస్యల పరిష్కారం కోసం అర్జీలు ఇచ్చే స్పందన కార్యక్రమం కన్నా మెరుగైన పరిష్కారం, అధికారుల్లో జవాబుదారీతనం కోసమే 'జగనన్నకు చెబుదాం'ను ప్రారంభించారని తెలిపారు. ఇందులో భాగంగా ప్రత్యేకంగా 1902 హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారని, హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి గ్రీవెన్స్ రిజిస్టర్ చేస్తే దాన్ని అత్యంత నాణ్యతతో పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. పరిష్కారంపై అన్ని స్థాయిల్లో మానిటరింగ్‌తో పాటుగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతి జిల్లా పర్యవేక్షణకు ప్రత్యేకంగా సీనియర్ అధికారులను నియమించారన్నారు. గ్రీవెన్స్ పరిష్కారంలో క్వాలిటీని పెంచడం అన్నది ప్రధాన లక్ష్యంగా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. హెల్ప్ లైన్‌కు గ్రీవెన్స్ వస్తాయని వాటిని నిర్దేశిత సమయంలోగా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. ఐవీఆర్ఎస్, ఎస్ఎంఎస్‌ల ద్వారా తాము చెప్పిన సమస్యల పరిష్కారంపై ప్రజలకు క్రమం తప్పకుండా అప్‌డేట్స్ అందుతాయని, సమస్యల పరిష్కారంపై అర్జీదారుల నుంచి ఫీడ్ బ్యాక్ కూడా తీసుకుంటుందన్నారు. వార్డు సచివాలయాల్లో వలంటీర్లు ప్రతి ఇంటిని సందర్శించి 1902 హెల్ప్ లైన్ గురించి అవగాహన కల్పించాలన్నారు. డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ భాస్కర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, సీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, ఎంహెచ్ఓ డాక్టర్ భానుప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ, స్పందన అధికారులు, విభాగ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు యాక్షన్ ప్లాన్

నెహ్రూ నగర్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని హౌసింగ్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులను నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. మంగళవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో ఇంజినీరింగ్, హౌసింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఎమినిటీ కార్యదర్శులతో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత లే అవుట్స్ వారీగా ఇళ్ల నిర్మాణం ఏమేరకు పూర్తి అయింది, గ్రౌండ్ లెవల్‌లో ఎన్ని ఉన్నది, మౌలిక వసతులు, బిల్స్ చెల్లింపు, ఇసుక, సిమెంట్, ఇనుము లభ్యత తదితర అంశాలను అధికారులను, ఏమినిటీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా జరగాలని, నిర్మాణ పనుల కాంట్రాక్ట్ పొందిన కాంట్రాక్టర్లు అవసరమైన కార్మికులను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి లే–అవుట్ నుంచి కాంట్రాక్టర్ ప్రతి రోజు నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా పనులు చేయాలని, నోడల్ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. లే అవుట్‌ల వారీగా ఎప్పటికప్పుడు పనుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని, ఏ సమస్య ఎదురైనా అధికారులు సమన్వయంతో పరిష్కరించి పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లే అవుట్‌ల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని, లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేసుకునేలా సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ ఎస్ఈ భాస్కర్, ఈఈ సుందర్ రామిరెడ్డి, హౌసింగ్ ఈఈ శంకరరావు, నగరపాలక సంస్థ, హౌసింగ్ డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా
- వార్డు సచివాలయాలు ప్రారంభం



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, మేయర్ కావటి మనోహర్ నాయుడు

పట్నంబజారు: అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో ముందుకు తీసుకెళుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా తెలిపారు. మంగళవారం 14వ డివిజన్‌లోని నల్లచెరువు వాటర్ ట్యాంకుల వద్ద 57, 58 సచివాలయాలకు సంబంధించి నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడుతో కలిసి శాశ్వత భవనాలు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పాలన దగ్గర చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. పేద ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి మంచి చేస్తేనే ఓటు వేయండని అడిగే నిజమైన నాయకుడు సీఎం జగన్ అని కొనియాడారు. నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ సచివాలయం, వలంటీరు వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ విప్లవం సృష్టించారన్నారు. డివిజన్ కార్పొరేటర్ వేముల జ్యోతి, వైఎస్సార్ సీపీ నేతలు నూరిఫాతిమా, శ్రీను, పార్టీ నేతలు, కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్‌కు శంకుస్థాపన...

నియోజకవర్గంలోని 14వ డివిజన్ నల్లచెరువు వాకింగ్‌ట్రాక్ పునఃనిర్మాణానికి తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ నిత్యం వాకింగ్ చేసే ప్రతి ఒక్కరికీ ఎంతో ఉపయోగకరంగా ఉండేలా వాకింగ్ ట్రాక్‌ను పునఃనిర్మిస్తున్నట్లు తెలిపారు. నగర మేయర్‌కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ అన్ని హంగులతో వాకింగ్ ట్రాక్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. రూ. 60 లక్షల వ్యయంతో పునఃనిర్మాణ చర్యలు చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, డివిజన్ కార్పొరేటర్లు, పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠపురంలో వార్షిక బ్రహ్మోత్సవాలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

తెనాలి: స్థానిక లక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానం, వైకుంఠపురంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజైన మంగళవారం నిత్యహోమం, ఆలయ బలిహరణ, నవకుంభారాధన నిర్వహించారు. భక్తులు, దేవస్థాన అర్చకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కూచిపూడి నృత్యప్రదర్శన పోటీలు జరిగాయి. జూనియర్స్ విభాగంలో కంతేటి గగనశ్రీ ప్రథమ బహుమతిని గెలుచుకోగా, లక్ష్మీప్రణతి ద్వితీయ బహుమతిని, సుజిత్ తృతీయ బహుమతిని గెలిచారు. సీనియర్స్ విభాగంలో సీహెచ్ వైష్ణవి, జి.సాత్విక, యు.హారికలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలిచారు. దేవస్థాన ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ పువ్వల వరదరాజులు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.తిమ్మానాయుడు విజేతలకు బహుమతులను అందజేశారు.

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ వెంకట్రావు

తెనాలి: ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న అత్యంత ప్రధానమైన సమస్య డ్రగ్స్ అని, నేటి యువతరం వీటికి దూరంగా ఉండాల్సిన ఆవశ్యకత ఉందని టూటౌన్ సీఐ వెంకట్రావు చెప్పారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్ స్టెప్, గుంటూరు, ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కాలేజీ కాన్ఫరెన్స్ హాలులో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. సీఐ వెంకట్రావు మాట్లాడుతూ తెనాలి, పరిసర ప్రాంతాల్లో గంజాయి విరివిగా లభిస్తోందని, దీనిని అరికట్టేందుకు పోలీసుశాఖ ఎంతగానో కృషిచేస్తోందని తెలిపారు. గంజాయి విక్రయ మూలాలను ఛేదించేందుకు పోలీసులు చేస్తున్న కృషికి సమాజం తోడుగా నిలవాలన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన యువతతో ఆయా కుటుంబాలు మాత్రమే కాకుండా పరిసరాల్లోనివారు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. డ్రగ్స్ జోలికి వెళ్లకుండా ఉండటంతోనే మనం నియంత్రణ చేయొచ్చని వివరించారు. 'స్టెప్' సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతి విద్యార్థి తమవంతు బాధ్యత తీసుకోవాలని కోరారు. ఇందుకోసమే డిపార్టుమెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్ అవగాహన సదస్సులను చేపడుతున్నట్లు వివరించారు. ఎన్ఎస్ఎస్ విభాగం కో–ఆర్డినేటర్ వెంకటేశ్వర శర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

పొన్నూరులో విద్యుత్ అధికారుల తనిఖీలు



తనిఖీల వివరాలను తెలియజేస్తున్న విజిలెన్స్ ఏడీఈ సురేంద్రబాబు, అధికారులు

పొన్నూరు(చేబ్రోలు): విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని బాపట్ల విద్యుత్‌శాఖ ఈఈ జి.ఆంజనేయులు చెప్పారు. జిల్లాలోని విద్యుత్‌శాఖ ఏఈలు, ఏడీఈలు 40 బృందాలుగా ఏర్పడి పొన్నూరు పట్టణంలో మంగళవారం విద్యుత్ సర్వీసులను ఆకస్మిక తనిఖీ చేశారు. 2,798 సర్వీసులు పరిశీలించారు. 59 సర్వీసులపై కేసులు నమోదు చేశారు. మొత్తం రూ.3.24లక్షలు అపరాధ రుసుం విధించారు. విజిలెన్స్ ఏడీఈ సురేంద్రబాబు, బాపట్ల ఈఈ జి ఆంజనేయులు, వివిధ మండలాలకు చెందిన ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పొన్నూరు విద్యుత్ కార్యాలయం వద్ద తనిఖీల వివరాలను వెల్లడించారు.

'జగనన్నకు చెబుదాం' పోస్టర్ల ఆవిష్కరణ



పెదనందిపాడు: ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తహసీల్దార్ సుభాని చెప్పారు. మంగళవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జగనన్నకు చెబుదాం పోస్టర్‌ను ఆవిష్కరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలు 1902 నంబర్ కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో కె.సాయిలీల, ఏఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మద్యం మత్తులో జీవితాలు పాడు చేసుకోవద్దు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న తాడేపల్లి సీఐ శేషగిరిరావు

తాడేపల్లిరూరల్: మద్యం మత్తులో ద్విచక్రవాహనాలు నడిపి జీవితాలు నాశనం చేసుకోవద్దని తాడేపల్లి సీఐ శేషగిరిరావు అన్నారు. మంగళవారం సాయంత్రం వివిధ ప్రాంతాల్లో మద్యం తాగి ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తున్న 8 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ మద్యం సేవించి ద్విచక్రవాహనాలను, ఇతర వాహనాలను ఇష్టం వచ్చినట్లు నడపడం వల్ల మీ ప్రాణాలతోపాటు, ఎదుటివారి ప్రాణాలు కూడా పోయే అవకాశం ఉందని అన్నారు. మద్యం మత్తులో ద్విచక్రవాహనాలు నడిపి ప్రాణాలు కోల్పోయిన ఎంతో మంది కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యాయని, ఎవరూ మద్యం తాగి వాహనాలు నడపవద్దని అన్నారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, మద్యం తాగి వాహనాలు నడిపినా తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ సీజ్

మంగళగిరి: ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ లారీని మంగళగిరి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది సీజ్ చేసి రూరల్ పోలీసులకు అప్పగించారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం నుంచి మంగళగిరికి ఇసుక తరలిస్తున్న టిప్పర్ లారీని మార్గంమధ్యలోని యర్రబాలెం పాగాకు కంపెనీ వద్ద మంగళవారం సెబ్ సీఐ మారయ్యబాబు ఆదేశాల మేరకు సెబ్ ఎస్ఐ మల్లికార్జునరావు నేతృత్వంలో సిబ్బంది గోవింద్, హనుమంతు తనిఖీలు నిర్వహించారు. డ్రైవర్ వద్ద ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి డ్రైవర్‌తో మంగళగిరి రూరల్ పోలీసులకు అప్పగించారు.

రేపు చేబ్రోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

చేబ్రోలు: చేబ్రోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం 11వ తేదీ ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ బి.బాబురావు మంగళవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కె.సాహితి అధ్యక్షతన గురువారం జరిగే సమావేశంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష, 2022–23 సాంవత్సరిక లెక్కలు తదితర అంశాలపై చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. మండలంలోని అందరూ ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులు హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

చినకోండ్రుపాడులో ఫ్యామిలీ ఫిజీషియన్

చినకోండ్రుపాడు (ప్రత్తిపాడు): ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కెజియాగ్రేస్ తెలిపారు. చినకోండ్రుపాడులో మంగళవారం ఫ్యామిలీ ఫీజీషియన్ నిర్వహించారు. వైద్యాధికారులు 55 మంది రోగులను, గర్భిణులు, బాలింతలను పరీక్షించారు. వారికి వైద్య పరీక్షలు జరిపి మందులను అందజేశారు. అనంతరం గృహ సందర్శనలు జరిపి అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన చర్యలు, వ్యక్తిగత పరిశుభ్రతకు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు.

డెటాల్ తాగి వ్యక్తి మృతి

పెదకాకాని: మద్యం అనుకుని పొరపాటున డెటాల్ తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మరణించిన ఘటన తక్కెళ్ళపాడులో జరిగింది. పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన పెరవలి అబ్రహాం కొంతకాలంగా మానసిక పరిస్థితి సరిగా లేక అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. ఈనెల 7న సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో ఇంటిలో ఉన్న డెటాల్‌ను మద్యంగా భావించి పొరబాటు తాగాడు. గమనించిన అతని కుమారుడు కుమార్ చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. చికిత్స పొందుతున్న అబ్రహాం(56) పరిస్థితి విషమించి మరణించాడు. కుమార్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్ బాబు తెలిపారు.

ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉండాలి

కాకుమాను: గ్రామాలలోని ఆశా కార్యకర్తలు తమకు కేటాయించిన గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండాలని డాక్టర్ రవి ప్రసాద్ చెప్పారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉన్న దృష్ట్యా తగిన జాగ్రత్తలు పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. గ్రామాలలో గర్భిణులను గుర్తించి వారికి ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వసతులు, సదుపాయాల గురించి పూర్తి స్థాయిలో వివరించాలని చెప్పారు. సమావేశంలో డాక్టర్–2 రాజశేఖర్, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేసిన హైకోర్టు ఏజీపీ



మంగళగిరి: నగరంలోని గ్రంథాలయానికి స్థానిక ఏపీఎస్పీ శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన హైకోర్టు ఏజీపీ అప్పల షణ్ముఖరెడ్డి మంగళవారం న్యాయవ్యవస్థపై అవగాహన కల్పించే పుస్తకాలు, నిరుద్యోగులు, విద్యార్థులకు ఉపయోగపడే పోటీ పరీక్షలకు సంబంధించిన తెలుగు, ఇంగ్లీషు మీడియం పుస్తకాలు 76 లైబ్రేరియన్ ఆరోగ్యంకు అందజేశారు. హైకోర్టు ఏజీపీ షణ్ముఖరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు న్యాయ వ్యవస్థపై, చట్టాలపై అవగాహన కలగాలనే ఉద్దేశంతో పుస్తకాలను అందజేయడం జరిగిందన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే పేద, మధ్యతరగతి నిరుద్యోగులు, విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు అందజేశామన్నారు. భవిష్యత్తులో మరిన్ని పుస్తకాలను అందజేయడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ఆదర్శ విద్యావేత్త కన్నా మాస్టారు

కర్నూలు ఎంపీ డాక్టర్ ఎస్.సంజీవకుమార్



కన్నా మాస్టారు దంపతులను సత్కరిస్తున్న ఎంపీ డాక్టర్ సంజీవకుమార్, ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: పేద, బడుగు, బలహీన వర్గాలకు విద్యాబోధన చేయాలనే ఆసక్తితో వాణిజ్య పన్నుల శాఖలో గ్రూప్–1 స్థాయి అధికారిగా చేస్తున్న ఉద్యోగాన్ని వదులుకుని వచ్చిన కన్నా మాస్టారు ఆదర్శ విద్యావేత్తగా ఎదిగారని కర్నూలు పార్లమెంటు సభ్యుడు డాక్టర్ సింగరి సంజీవకుమార్ పేర్కొన్నారు. ఏఎన్‌యూ దూరవిద్య కేంద్రం ద్వారా విద్యాబోధనపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ పొందిన కన్నా మాస్టారు (విన్నకోట వెంకటేశ్వర్లు) అభినందన సభను మంగళవారం ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ సంజీవకుమార్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులను ఉత్తమమైన పౌరులుగా తీర్చిదిద్దిన తీరు అభినందనీయమన్నారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ దశాబ్దాలుగా ఎంతో మంది పేదలకు ఉచితంగా, అతి తక్కువ ఫీజులతో విద్యాబోధన చేస్తున్న కన్నా మాస్టారు ఒక రోల్ మోడల్ అని కొనియాడారు. సమాజహితం కోసం విద్యారంగంలో పరిశోధన చేసి డాక్టరేట్ సాధించడం గొప్పవిషయమన్నారు. ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (అపుస్మా) జిల్లా అధ్యక్షుడు పోతిరెడ్డి మాట్లాడుతూ కన్నా మాస్టారు నగర అపుస్మా అధ్యక్షునిగా విశేష సేవలు అందించారని తెలిపారు. హైకోర్టు న్యాయవాది, సామాజిక ఉద్యమ నేత వైకే మాట్లాడుతూ విద్యారంగంతోపాటు పద్మశాలీల సంఘ భవన నిర్మాణానికి రూ.లక్షలాది విరాళాలు ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో హిందూ కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి, నూతలపాటి తిరుపతయ్య, కొండా శివరామిరెడ్డి, డాక్టర్ చంద్రశేఖరరావు, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, గుర్రం చిన వీరయ్య, బి. కైలాష్‌నాథ్, ఆర్.పరమేశ్వరరావు, నగరంలోని పలు విద్యా, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రైస్తవుల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట



క్రైస్తవ భద్రతా దినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న ప్రేమజ్యోతిబాబు

నెహ్రూనగర్: రాష్ట్రంలో దళిత క్రైస్తవులు, క్రైస్తవుల అభ్యున్నతికి, వారి భద్రతకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మద్దు ప్రేమజ్యోతిబాబు పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ క్రైస్తవ భద్రత దినోత్సవాన్ని బొంగరాలబీడులోని సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో చర్చిల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పాటు, క్రైస్తవులకు ఇబ్బందులకు ఉన్నటువంటి శ్మశానవాటికల అంశానికి తగిన పరిష్కారం చూపుతున్నారని కొనియాడారు. దేశంలో అక్కడక్కడా క్రైస్తవులపై, క్రైస్తవ బోధకులపై దాడులు జరుగుతున్నాయని, భవిష్యత్తులో ఈ దాడులు పునరావృతమైతే అయితే దేశంలోని క్రైస్తవులందరం ఏకమై దాడులను తిప్పికొడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు డొక్కా జార్జి, ఎస్.శరత్‌బాబు, కందుల దీనమణిరాజు, బండారు అరుణ్, మోపర్తి శ్రీనివాసరావు, జల్ది స్వామినాథ్, మాణిక్యరావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు

ఆశయాలపై నిబద్ధత అవసరం



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆశయాలపట్ల నిబద్ధత కలిగినవారే నిజమైన కార్యకర్తలు అని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాల్లో మంగళవారం యూటీఎఫ్ నాయకులు ఎండీ గౌస్, కె.నాగమల్లేశ్వరరావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా వారికి నివాళులర్పించారు. ఈసందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షురాలు బి.ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తుది శ్వాస వరకు గౌస్, నాగమల్లేశ్వరరావు సంఘంలో పని చేయడం అందరికీ ఆదర్శమన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు కె.జోజయ్య, జిల్లా పూర్వ అధ్యక్షుడు జి.ప్రభుదాస్, పూర్వ కోశాధికారి ఎస్. తాండవకృష్ణలు మాట్లాడారు. సీనియర్ నాయకుడు కేఎస్‌వీ దుర్గారావు, రాష్ట్ర ప్రచురణల కమిటీ ఎం.హనుమంతరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. కళాధర్, జిల్లా కోశాధికారి ఎండీ గయాసుద్దీలా, కార్యదర్శులు పాల్గొన్నారు.

దేవాలయ ఉపకరణాలు ఊరేగింపు



పెదనందిపాడు: ఆంధ్ర ఇవాంజలికల్ లూథరన్ పరిశుద్ధ దేవాలయం ఉపకరణాలు ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం పెదనందిపాడు గ్రామ వీధులలో శిలువ, గద్ద, ఆల్టర్, దేవాలయానికి సంబంధించిన ఉపకరణాలను గ్రామ పురవీధులలో మేళతాళాలతో ఊరేగించారు. సంఘకాపరి ఆలయంలో ప్రజల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.